

ఏఎస్సై మొయిజుద్దీన్‌కు ఇండియన్ పోలీస్ మెడల్



మహబూబ్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో విశేష సేవలందించిన ఏఎస్సై మహమ్మద్ మొయిజుద్దీన్‌కు భారత ప్రభుత్వం అత్యుత్తమ సేవా పతకం ఇండియన్ పోలీస్ మెడల్ ప్రకటించింది. 1989లో కానిస్టేబుల్‌గా నియమితు లైన ఈ యన ఉమ్మడి జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వర్తించారు. పోలీస్‌శాఖలో చేసిన విశిష్ట సేవలకు గాను 70 క్యాష్‌రివార్డులు, 18 జీఎస్ఈలు, 12 ప్రశంసాపత్రాలు, ముఖ్య మంత్రి సర్వోన్నత పతకం, ఉత్తమ పోలీస్ సేవాపతకం అందుకున్నారు. ఉత్తమ పురస్కారానికి ఎంపికైన అధికారిని ఎస్పీ జానకి అభినందించారు.

జల దిగ్బంధం

- పలుచోట్ల కుంటలకు గండ్లు.. కూలుతున్న పాత ఇళ్లు
- నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం.. ఇళ్లలోకి చేరిన నీరు
- అమర్‌రాజా కంపెనీ రహదారికి కోత.. అందులో చిక్కుకున్న బస్సు
- రైల్వే అండర్‌పాస్‌లలోకి భారీగా వరద.. పలుచోట్ల కూలిన సైడ్‌వాల్స్
- పోల్కంపల్లి వాగులో చిక్కుకున్న 970 జీవాలు.. కాపాడిన గ్రామస్థులు, సహాయక బృందాలు
- సంగంబండ జలాశయం నుంచి 5 గేట్లు ఎత్తి నీటి విడుదల



కోతకు గురైన అమర్‌రాజా కంపెనీకి వెళ్లే రహదారి



వాగు నీటిలో మునిగిన గొర్రెలను దాటిస్తున్న మూసాపేట ఎస్ఐ వేణు

ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రంతా కురిసిన వర్షానికి వాగులు పొంగుతున్నాయి. చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా అన్ని మండలాలలో భారీ వర్షం కురవడంతో ఎక్కడ చూసినా నీరే కనిపిస్తోంది. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలు జల దిగ్బంధంలో కూరుకుపోయాయి. పలు పాఠశాలలు వర్షపు నీటిలో ఉండిపోవడంతో విద్యార్థులకు సెలవు ప్రకటించారు. అమర్‌రాజా కంపెనీ రహదారికి కోత పడటంతో అందులో బస్సు చిక్కుకపోయింది. రైల్వే అండర్‌పాస్‌లలోకి భారీగా వరద చేరింది. పోల్కంపల్లి వాగులో చిక్కుకున్న 970 జీవాలను గ్రామస్థులు, సహాయక బృందాలు కాపాడాయి. సంగంబండ జలాశయం నుంచి 5 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. పలుచోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి.

– మహబూబ్‌నగర్, నారాయణపేట, ఆంధ్రజ్యోతి

(● మరిన్ని వివరాలు లోపలి పేజీల్లో..)

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. రైల్వే అండర్‌పాస్‌లు వరద ఉధృతికి కోతకు గురికాగా, అండర్‌పాస్‌లపైకి భారీగా వరద నీరు చేరడంతో జనాలకు రాకపోకలు నిలిచిపోచాయి. మహబూబ్‌నగర్ నగరానికి ఎగువన ఉన్న చిక్కుడువాగు, గాండ్లోనికుంటల నుంచి భారీగా వరద రావడంతో నాలాలు పొంగి లోతట్టు కాలనీలలోకి నీరు చేరుకుంది. దీంతో లక్ష్మీనగర్ కాలనీ, గోల్‌మజీద్ ప్రాంతాలలో పలు ఇళ్లలోకి నీరు చేరింది. ఎదిర కుంట తెగిపోవడంతో ఈ నీరు ఉధృతంగా ప్రవహించడం వల్ల ఐటీ పరిశ్రమలోని అమర్‌రాజా కంపెనీలో రహదారి కింద ఉన్న కల్వర్టు కోతకు గురై బీటీరోడ్డు రెండుగా చీలిపోయింది. కంపెనీకి చెందిన బస్సు డ్రైవర్ కోతను గమనించకుండా వెళ్ళడంతో ముందుభాగం అందులో కూరుకుపోయింది. బస్సు ఓవైపు ఒరిగిపోగా అందులో ఉన్న 18 మందికి స్వల్పగాయాలయ్యాయి. బస్సు వెనక డోర్‌నుంచి అందులో ఉన్న వారికి సురక్షితంగా బయటకు తీసి క్రేన్ సాయంతో బస్సును వెలికితీశారు. వెనకవైపు డోర్‌నుంచి బస్సులో ఉన్న కంపెనీకి చెందిన సిబ్బంది నెమ్మదిగా కిందికి దిగారు. మూసాపేట మండలం పోల్కంపల్లి పెద్దమ్మ వాగులో 970 గొర్రెలు చిక్కుకుపోయాయి. గ్రామస్థులు విషయాన్ని పోలీసులకు, ఎమ్మెల్యే జీఎంఆర్‌కు తెలియజేశారు. పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ బృందాలు అక్కడికి చేరుకుని పడవలు, రోప్ సాయంతో జీవాలను బయటకు సురక్షితంగా తీశారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కూడా వాగువద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాగా భారీ వర్షాలకు రైల్వే అండర్ బ్రిడ్జిలపైకి భారీగా వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలోని అన్ని అండర్‌బ్రిడ్జిలను వరద ముంచెత్తడంతో పరిస్థితి దయనీయంగా మారింది. నగరంలోని పాలిటెక్నిక్ అండర్‌బ్రిడ్జి సైడ్‌వాల్స్ కూలిపోయాయి. వరద నీరు కుంటను తలపించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అప్పన్నపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద అదే పరిస్థితి కనిపించింది. సైడ్ గోడలు నాని కూలిపోయాయి. నీరంతా నిలిచిపోయింది. మోతీనగర్ వద్ద కూడా ఇదే పరిస్థితి కనిపించడంతో నగరానికి మోతీనగర్‌కు లింక్ కట్ అయింది.



మహబూబ్‌నగర్ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీరు

● నారాయణపేట మండలం సింగారం వాగు పొంగి పొర్లుతున్నది. కొత్తపల్లి మండలం భూనేడ్ నుంచి మద్దూర్‌కు వెళ్లే రహదారిలో వాగు ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంగంబండ జలాశయం నుంచి 5 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మరికల్ మండలం పుస్సుల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణతో పాటు తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరింది. మరికల్ పెద్ద చెరువు అలుగు పారడంతో మహబుబ్‌నగర్ - రాయిచూర్ అంతర్రాష్ట్ర రహదారిలో నీరు పారింది. నర్వ మండలం కల్వాల, శ్రీపురం గ్రామాల మధ్య వాగు నీటి ఉధృతంగా ప్రవహించడంతో కల్వాల జడ్పీహెచ్ఎస్‌లోకి నీరు చేరింది. ఊట్కూర్ మండలం మల్లేపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమేశ్వర్ బండ, నాగిరెడ్డిపల్లి, మల్లేపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ధన్వాడ మండలం మన్నేవాగు అధికంగా ప్రవహించడంతో కంసాన్‌పల్లి నుంచి ధన్వాడకు రాకపోకలు నిలిచాయి. మరికల్ పెద్ద చెరువు అలుగు పారడంతో మహబుబ్‌నగర్ - రాయిచూర్ అంతర్రాష్ట్ర రహదారిలో నీరు పారింది. పరిసరాల్లో పంట పొలాల్లోకి నీరు చేరింది. మక్తల్ మండలం మందన్‌గోడ్ -గుల్లపల్లి మధ్య వాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచాయి. కోస్గి మండలం ముశ్రీఫా వాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. మాగనూర్ మండలం బైరంపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామం నుంచి ప్రజలు వాగులోకి వెళ్లకుండా ట్రాక్టర్‌లు రహదారిలో అడ్డంగా పెట్టారు.



మాగనూరు మండలంలోని అడవి సత్యారం బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలి



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్‌గౌతమ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు ఉన్నందున స్వాతంత్ర్య వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పరేడ్ మైదానంలో సాయుధ పోలీసుల కవాతును బాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలను తిలకించడానికి వచ్చే అతిథులుకు, విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, అదనపు ఎస్పీ ఎండీ.రియాజ్ హుల్‌హక్, ఆర్డీవో రాంచందర్, డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, ఆర్ఐ నరసింహ, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

పరేడ్‌ను పరిశీలించిన ఎస్పీ

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ ప్రాక్టీస్‌ను ఎస్పీ యోగేష్‌గౌతమ్ పరిశీలించారు. పరేడ్ బాగా చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



కోస్గి మండలంలోని ముశ్రీఫా వాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు



భూనీడు-కొత్తపల్లి వాగు ప్రవాహన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ లింగయ్య

వరద ప్రాంతాలను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల వల్ల తలెత్తిన పరిణామాలను ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దివిటిపల్లి- ఎదిర ప్రాంతాలను పరిశీలించారు. తెగిన కుంట వల్ల రెండు ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతా ల్లో వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికా రులను ఆదేశించారు. ఐటీ పరిశ్రమలో కోతకు గురై న రహదారిని పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అప్పన్నపల్లి రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలించారు. కలెక్టర్, జోగుళాంబజోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రె డ్డిలు పలు ప్రాం తాల ను పరిశీ లించారు. దివిటిపల్లి, భూత్పూర్ ప్రాంతాలను పరిశీ లించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. వెంట నే సహాయక చర్యలను చేపట్టాలని అధికారులకు సూచించారు.

● అలాగే, నారాయణపేట జిల్లాలో మహబూబ్ నగర్- రాయచూర్ ప్రధాన అంతర్రాష్ట్ర రహదారిలో మరికల్ పెద్ద చెరువు అలుగు నీరు పారడంతో ఎస్పీ పరిశీలిం చి అ క్క డి ప్రజలతో మా ట్లాడి సూచనలు చేశారు. ధన్వాడ మండలం కసాన్‌పల్లి, ఎన్మోన్‌పల్లి వా గు ప్రవహిస్తుండటంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాం చందర్, ధన్వాడ తహసీల్దార్, అధికారులు ఉన్నారు. భూనేడ్-కొత్తపల్లి వాగు ప్రవాహాన్ని డీఎస్పీ లింగ య్య పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.



ధన్వాడ మండలం కంసాన్‌పల్లి - యన్మనోన్‌పల్లి వాగు ప్రవాహాన్ని పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

ప్రజాస్వామ్యం ఖూనీ



పేటలో కొవ్వొత్తులతో కాంగ్రెస్ ర్యాలీలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఓటరు లిస్టులో అవకతవకలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి విమర్శించారు. గురువారం డీసీసీ కార్యాలయంలో టీపీసీసీ ఆదేశాల మేరకు ఓట్ చోరీ కార్యక్రమంపై డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎల్‌సీడీ స్క్రీన్ ద్వారా అవగాహ న కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే మాట్లాడుతూ ఓటరు నమోదులో జరుగుతున్న అక్రమాలను దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. సీవీఆర్ బంగ్లా నుంచి నర్సిరెడ్డి చౌరస్తా వరకు నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.



వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం తాడిప్రతి గ్రామంలో లక్ష్మీసముద్రం అలుగు పారడంతో ఏర్పాటు చేసిన బారిగేడ్లు

శేరుపల్లి వద్ద చెరువు తెగడంతో చేప పట్టుకెళ్తున్న యువకులు

కల్వకుర్తి పట్టణంలో జలమయమైన విద్యానగర్ కాలనీలో పర్యటిస్తున్న అధికారులు



ఉధృతంగా ప్రవహిస్తున్న నారాయణపేట మండలంలో సింగారం వాగు

వర్షంతో అస్తవ్యస్తం

- నిండిన చెరువులు
- పంట పొలాలను ముంచెత్తిన వరద
- సహాయక చర్యలు చేపట్టిన అధికారులు



వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం మున్నూరు గ్రామానికి వెళ్లే దారిలో అలుగు పారుతున్న చెరువు

చిన్నచింతకుంట/ కల్వకుర్తి/ భూత్పూర్/ ఖిల్లాఘనపురం/ మహమ్మదాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరుణుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాల కారణంగా వాగులు, చెరువులకు, ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున వరద పోటెత్తింది.

● చిన్నచింతకుంట మండలంలో ఊకచెట్టు వాగు వరదతో ఉప్పొంగుతుంది. కౌకుంట్ల మండలం ముచ్చింతల వద్ద కాలువ తెగిపోవడంతో దాదాపు 60 ఎకరాల్లో వరి పంట పూర్తిగా నీట మునిగింది. ఉంద్యాల శివారులో చెరువు అలుగు పారడంతో సమీపంలోని 30 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది.

● కల్వకుర్తి పట్టణం విద్యానగర్ కాలనీలో లోతట్టు ప్రాంతమైన బచ్‌పన్ స్కూల్ ఏరియా బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పూర్తిగా జలమయమైంది. మునిసిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. రఘుపతిపేట వద్ద దుందుభి నది ఉధృతంగా ప్రవహిస్తుండగా, తహసీల్దార్ ఇబ్రహీం, సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి పరిశీలించారు. ప్రజలు ఎవరూ వాగులు దాటే ప్రయత్నాలు చేయకూడదని సూచించారు.

● భూత్పూర్ మండలంలోని వెల్కిచర్ల, మద్దిగట్ల, కప్పెట, హస్నాపూర్, శేరిపల్లి, తాటికొండ, తాటపర్తి చెరువులన్నీ అలుగు పారాయి. పోతులమడుగు వాగు ఉధృతంగా ప్రవహిస్తుడంతో గోపన్నపల్లి గ్రామస్థుల రాకపోకలు నిలిచిపోయి.

● ఖిల్లాఘనపురం మండలంలోని ఆగారం, కమలోద్దిన్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న వాగుల కల్వర్టులపై నుంచి వరద ప్రవహించడంతో రోడ్డుపై ముళ్ల కంచెలు వేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మండల కేంద్రంలోని భోజవాగు కట్ట తెగి పొలంలోకి ఇసుకమేటలు, వరద చేరి నీట మునిగాయి.

● మహమ్మదాబాద్, మొకర్లబాద్, గాధిరాల్ ఇటీవల వేసిన వరినాట్లు పది ఎకరాల వరకు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి.



వనపర్తి జిల్లా పెద్దమందడిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటుతున్న మహిళలు



కౌకుంట్ల మండలం ముచ్చింతల శివారులో కర్ణికుంట వద్ద కాలువ తెగిపోవడంతో పొలాలను ముంచెత్తిన వరద



ధన్వాడ పాతపల్లి వాగు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పరిశీలిస్తున్న నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్



శేరిపల్లి వద్ద కుంట తెగి పారుతున్న నీరు



ఐతోల్-సిర్పవాడ గ్రామాల మధ్య వరద ప్రవాహంతో నిలిచిన రాకపోకలు



దేవరకద్ర మండలం గోపన్నపల్లిలో నిలిచిపోయిన రాకపోకలు

కందనూలులో 147.6 మి.మీ వర్షపాతం

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో 147.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తిమ్మాజిపేట మండలంలో 105.5, పెద్దకొత్తపల్లిలో 97.9, వెల్దండలో 84.0, ఉప్పునుంతలలో 83.4, వంగూరులో 76.0, బిజినేపల్లిలో 75.3, చారకొండలో 66.2, నాగర్‌కర్నూల్‌లో 63.7, తాడూరులో 60.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో 126.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ధన్వాడ మండలంలో 98.8 మి.మీ., కొత్తపల్లి మండలంలో 91.8, కోస్గి 98.0, గుండుమాల్ 83.0, నర్వ 80.4, నారాయణపేట 74.6, ఊట్కూర్ 67.8, దామరగిద్ద 47.6, మి.మీ. వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 123 మి.మీ. వర్షపాతం నమోదైంది. మూసాపేటలో 103, దేవరకద్రలో 98, కౌకుంట్ల 96.9, అడ్డాకుల 92.6, మహబూబ్‌నగర్ అర్బన్ 91, హన్వాడ 90.6, బాలానగర్ 86.8, గండీడ్ 84.7, సీసీకుంట 80.9, భూత్పూర్ 80.8, మహబూబ్‌నగర్ రూరల్ 75.5, మిడ్జిల్ 69.3, రాజాపూర్ 68.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపూర్ మండలంలో 116.8 మి.మీ వర్షపాతం నమోదయింది. పెద్దమందడి 103.3, కొత్తకోట, వనపర్తి 98.8, గోపాల్‌పేట 98.0, ఆత్మకూరు 93.5, రేవల్లి 79.8, మదనాపూర్ 79.3, పాన్‌గల్ 74.5, అమరచింత 71.0, పెబ్బేరు 57.3 మి.మీ వర్షపాతం నమోదైంది. జోగులాంబ గద్వాల ధరూర్‌లో 28.3 మి.మీ. వర్షం కురిసింది.



మహబూబ్‌నగర్ శివారు పొలాల్లో పారుతున్న నీరు



ఆగారం గ్రామ శివారులో ఉధృతంగా పారుతున్న వాగు



మహమ్మదాబాద్‌లో పొలంలో వరదలో కొట్టుకొచ్చిన ఇసుక

భారీ వర్షానికి కూలిన ఇళ్లు

- పూర్తిగా కూలిపోయిన 24 ఇళ్లు
- పాక్షికంగా దెబ్బతిన్న మరికొన్ని..



గోపాల్‌పేటలో వర్షానికి కూలిన ఇల్లు



నందిమల్ల గ్రామంలో వర్షానికి కూలిన ఇల్లు

జడ్చర్ల / మన్ననూర్/ ఊట్కూర్/ పెద్దకొత్తపల్లి/ ఖిల్లాగణపురం/ అలంపూరుచౌరస్తా/ గోపాల్‌పేట/ అమరచింత, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మట్టి ఇళ్లు కూలిపోయాయి. 24 ఇళ్లు పూర్తిగా కూలిపోగా, పలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జడ్చర్లలో భారీ వర్షానికి మునిసిపాలిటీలోని 17వ వార్డులో మూడు ఇళ్లు కూలాయి. ఘటనా స్థలాన్ని మునిసిపల్ చైర్ పర్సన్ పుష్పలత, స్థానిక నాయకులు పరిశీలించారు. జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ గ్రామంలో బుధవారం రాత్రి రామావ త్ ధర్మానాయక్, కేసుమల్ల అఖిల్‌కు చెందిన పాత ఇళ్లు కూలిపో యాయి. వర్షానికి ఊట్కూర్ మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన దుప్పల్లి అనంతమ్మ మట్టి ఇల్లు కూలి పడింది. ఖిల్లాగణపురం మండలంలో 8 పాత ఇళ్ల కూలినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. కమలోద్దీన్‌పూర్-3, మల్కిమియన్ పల్లి-2, ఖిల్లాగణపురం -2, మానాజిపేట్-1 ఇళ్లు కూలిపోయాయి. పెద్దకొత్తపల్లి మండలంలోని బాచారం గ్రామంలో మొలకల బాలయ్య నివాసముంటున్న మట్టి మిద్దె భారీ వర్షాల కారణంగా కూలిపోయింది. వర్షాలకు నాలుగు ఇళ్లు కూలినట్లు ఉండవల్లి తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. మండలంలోని తక్కశిలలో ఒకటి, ప్రాగటూరులో రెండు, భైరపురం గ్రామంలో ఒక పాత ఇల్లు వర్షం ధాటికి కూలిపోయాయి. వీటిని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గోపాల్‌పేట మండలంలోని పోల్కెపాడ్, లక్ష్మీదేవునిపల్లి, బుద్దారం, చాకల్‌పల్లిలో నాలుగు మట్టి ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ పాండు నాయక్ తెలిపారు. అమర చింత మండలంలోని నందిమల్ల గ్రామానికి చెందిన దాసరి రంగ మ్మ ఇల్లు వర్షానికి పూర్తిగా కూలిపోవడంతో ఇంట్లో ఉన్న బియ్యం, బట్టలు పలు వంట సామాగ్రి ధ్వంసమయ్యాయి. పట్టణంలో త హసీల్దార్ రవికుమార్, కమిషనర్ నాగరాజు పరిశీలించగా, నంది మల్ల గ్రామంలో కూలిపోయిన దాసరి రంగమ్మ ఇంటిని ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు.



కమలోద్దీన్‌పూర్‌లో కూలిన హైమావతి ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

జలాశయాలకు జలకళ



కోయిల్‌సాగర్ రెండు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు



పరవళ్లు తొక్కుతన్న డిండి ప్రాజెక్టు

గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

దేవరకద్ర/చిన్నచింతకుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా తలపిస్తుంది. దీంతో ప్రాజెక్టు నుంచి ఐదు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. జూరాల నుంచి కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు నీటిని విడుదల చే యడంతో పాటు గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. గురువారం ఉదయం నాటికి 32.5 అడుగులకు చేరడంతో 13 గేట్లకు గాను ఐదు గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీరు ఎక్కువ వచ్చి చేరితే మరికొన్ని గేట్లను ఎత్తుతామన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల రైతులు పొలాలకు వెళ్లకూడదని సూచించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి నీటిని దిగువకు వదలడంతో చుట్టూ మూడు మండలాల రైతులు పంటలకు నీటి ఎద్దడి లేకుండా ఉంటుందన్నారు.

సంగంబండ రిజర్వాయర్ 5 గేట్లు ఎత్తివేత..

మక్తల్ రూరల్ : నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం ఐదు గేట్లు ఎత్తారు. గురువారం ఎగువ నుంచి పెద్దవాగుకు వరద ఎక్కువగా వస్తుంది. 3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 3 వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంద ని, రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.58 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈ సురేష్ తెలిపారు.

దుందుభీ పరవళ్లు..

అచ్చంపేట: డిండి ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం అధి కమవడంతో 2.45 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు నిం డు కుండలా మారి గురువారం ఉదయం నుంచే పరవళ్లు తొక్కుతుంది. శ్రీశైలం- హైదరాబాద్ 765 జాతీయ రహదారి సమీపంలో ప్రాజెక్టు ఉం డటంతో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది. నీటి ఉధృతి పెరగడంతో దిగువ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిం చారు. ఇప్పటికే అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి వద్ద పోలీసులు రహదారిపై వెళ్లకుండా ఆంక్షలు విధించారు.



సంగంబండ రిజర్వాయర్ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

విపత్కర పరిస్థితుల్లో మీరే హీరోలు

- కలెక్టర్ బీఎం సంతోష్
- ● బెటాలియన్‌లో ఎస్డీఆర్ఎఫ్ బృందం ప్రదర్శన



బెటాలియన్‌లో పరికరాల గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

ఎర్రవల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లో ప్రజలను కాపాడితే మంచి పేరు వస్తుందని, జీవితాలను కాపాడే వావరే హీరోలని ఎస్డీఆర్ఎఫ్ బృందానికి కలెక్టర్ బీఎం సంతోష్ అభినందించారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని శుక్రవారం పదో బెటాలియన్‌లో ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని, విపత్కర పరిస్థితుల్లో ప్రాణ, ఆస్తి నష్టాలను కాపాడేందుకు ఉపయోగించే పరికరాలను ఎస్పీ శ్రీనివాసరావు, బెటాలియన్ కమాండెంట్ జయరాజ్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లడుతూ.. గద్వాల జిల్లాలో ఎస్డీఆర్ఎఫ్ బృందం ఉండటం ఈ ప్రాంతానికి చాలా మంచిదన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గద్వాల రెడ్ అలర్ట్‌లో ఉందని, అందులో భాగంగానేఎర్రవల్లి పదో బెటాలియన్‌లో శిక్షణ పొందిన వంద మంది సిబ్బంది, పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రమాదాలు జరిగినసప్పుడు బెటాలియన్‌లో వరుస క్రమంలో పరికరాలను ప్రదర్శించి ఎలా ప్రాణాలను కాపాడుతారో బృందం డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పాణి, తహసీల్దార్ నరేష్, సీఐ రవిబాబు, ఎస్డీఆర్ఎఫ్ బృంద ఇన్‌చార్జి శ్రీనివాసులు, సంక్షేమ అధికారి నరసింహరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన ఇలా.. ప్రయాణం సాగేదెలా?

- ఆందోళన కలిగిస్తున్న మూడు రాష్ట్రాల జాతీయ రహదారి

అయిజ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి ఆందోళన కలిగిస్తోంది. అయిజ, పర్దిపూర్ గ్రామాల మధ్యన దర్గా సమీపంలో ఉన్న ఈ వంతెనను చూస్తేనే భయమేస్తోంది. అప్రోచ్ రోడ్డు వేశారు కదా అంటే అది భయంకరంగానే ఉంది. మరో దారిలేదు. దేవుడిపై భారం వేసి నేల కూలే వంతెనపై నుంచి ప్రయాణం సాగించాల్సిందే.

వంతెనపై సీసీ రంధ్రాలు

జాతీయ రహదారిపై దర్గా సమీపంలో 13 నెలల క్రితం వంతెనపై ఉన్న సీసీ రంధ్రాలు పడటంతో మట్టితో పూడ్చివేశారు. ఒకటి తర్వాత ఒకటి మూడు గోతులు అక్కడక్కడ పడ్డాయి. పూడ్చటం కోసం ఏకంగా మట్టి కప్పి వేశారు. 6 పునాది గోడల మధ్యన మూడు మూసుకుపోయాయి. ఇక మిగిలింది మూడే. 3 పాత పునాది గోడల మధ్య నుంచే వర్షం నీరు వెళ్లాల్సి ఉంది. అవి పునాది గోడలతో పాటు సైడ్ రాతి గోడలు దెబ్బతిన్నాయి. కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కూలకుండా కింది భాగంలో రాళ్లు ఉంచి పనికానిచ్చేస్తున్నారు.





నేల కుంగకుండా వంతెన కింద ఉంచిన రాళ్లు.. కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెనపై వెళుతున్న వాహనం

వాహనాలు వెళ్లేందుకు వీలు లే కుండా..

వంతెన దెబ్బతినటం, ఆధునీకీకరణం నిమిత్తం వంతెన పక్కనే అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. అది మరీ వింతగా తయారయ్యింది. ఎందుకు వేశారో తెలియని విధంగా మారింది. అది చిన్నది కావటంతో వాహనాలు వెళ్లటానికి వీలులేకుండా ఉంది. పైగా మట్టి కుంగిపోయిన కారణంగా అప్రోచ్ రోడ్డుపై వాహనాలు వెళ్లకుండా అటు, ఇటు రాళ్లు, ముళ్ల చెక్కలు ఉంచారు.

అగమ్యగోచరం

అటు అప్రోచ్ రోడు అలా.. వంతెన ఇలా.. ఉండటంతో ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. వంతెన మీదుగా వెళదామంటే ఎప్పుడు కూలుతుందోననే భయం ప్రయాణికులలో వెంటాడుతోంది. దారిమళ్లి అప్రోచ్ రోడ్డుపై వెళదామంటే అది కుంగిపోయింది. ప్రయాణికులు ఎవరు అటు మీదుగా వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా రాళ్లు, ముళ్ల పొదలు ఉంచారు. ఇక ఈ రెండింటిపై కాకుండా దారి మళ్లి పంట చేలల్లో వెళదామా అంటే అది వాగు, పైగా వర్షాకాలం, చౌడు నేలలో వాహనాలు అందులో కూరుకుపోయాయంటే బయటకు తీయటం కష్టమే మరి. పైగా ఈ రహదారిపై ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, నెల్లూరు, కర్నూల్ నుంచి తెలంగాణలోని అయిజ మీదుగా కర్ణాటక ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. 3 రాష్ట్రాలను కలిపే రహదారి కావటంతో ఎప్పుడూ వందలాది వాహనాలు, వేలాది ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది.

నిధులు మంజూరు, పనులలో జాప్యం

వంతెన, 3 కల్వర్టుల నిర్మాణం, బీటీ ఆధునీకీకరణకై ఆర్అండ్‌బీ నిధులు రూ. 3 కోట్ల 50 లక్షలు మంజూరు చేశారు. గత 3 నెలల క్రితం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు.

కానీ ప్రస్తుతం పనులకు స్వస్తి చెప్పారు. ఎందుకు పనులు చేయటం లేదంటే నాకు రావాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి... అవి వచ్చిన తర్వాతే చేస్తానని ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

పనులు జరిగేలా చూస్తాం

వంతెన నేల కుంగకుండా కింద రాళ్లు వేశాం. ప్రమాదం జరగదు. వర్షం నీరు వెళ్లటానికి పక్కనే దారి ఉంది. గోతులు మట్టితో పూడ్చాం. త్వరగా పనులు చేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పనులు ప్రా రంభం అవుతాయి.

- అల్తాఫ్ ఆర్అండ్‌బీ ఏఈఈ

మావోయిస్టుల మారణకాండకు 20 ఏళ్లు



శిలాఫలకం దగ్గర చిట్టెం నర్సిరెడ్డి, పలువురి మృతదేహాలు (ఫైల్)

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలో మావోయిస్టుల మారణకాండ జరిగి శుక్రవారం నాటికి 20 ఏళ్లు అవుతుంది. ఇంకా నెత్తుటి మరకను ప్రజలు మరిచిపోవడం లేదు. ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. 2005లో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని మధ్యాహ్నం 1:15 గంటల ప్రాంతంలో స్థానిక పళ్ల హరిజన్‌వాడలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వెళ్లిన ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డిపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. ఆయనతో సహా తనయుడు చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి, 9 మంది మృతి చెందారు. మావోయిస్టులు పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని గుర్మిట్‌కల్‌ను కేంద్రంగా ఏర్పరచుకొని కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే లక్ష్యాన్ని పూర్తిచేసుకొని మొత్తం 11 మందిని హతమార్చారు. నర్సిరెడ్డి హత్య అనంతరం మావోయిస్టులపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. వారం రోజుల వ్యవధిలోనే జిల్లా కేంద్రానికి చెందిన మానవ హక్కుల నేత కనకాచారిని నర్సకోబ్రా పేరుతో హతమార్చారు. అనంతరం హత్యలో పాలుపంచుకున్న క్రైం నర్సప్పతో సహా మరో ఇద్దరు ఎన్ కౌంటర్‌లో మృతిచెందారు. ఈ ఘటనకు ప్రధాన భూమిక పోషించిన సాంబశివుడు, రమాకాంత్, రంజిత పోలీసులకు లొంగిపోయారు. బెయిల్‌పై విడుదలైన సాంబశివుడు తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకుంటూ హత్య కు గురయ్యాడు.

క్రైం కార్నర్

కారు, బైక్ ఢీ ఒకరికి గాయాలు

మల్దకల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌లో కారు, బైక్ ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని రైసు మిల్లు వద్ద గురువారం సాయంత్రం రాఘవేంద్రరెడ్డి తన కారులో మంత్రాయం నుంచి గద్వాలకు వెళ్తుండగా, కారు ముందు టైరు పేలి, గద్వాల నుంచి మద్దెలబండకు బైక్‌పై వస్తున్న సురేష్‌ను కారు ఢీకొంది. సురేష్‌కు గాయాలు కాగా గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

» బైక్‌ను ఢీకొట్టిన బొలెరో వాహనం



సంఘటనా స్థలం వద్ద పరిశీలిస్తున్న సీఐ రవిబాబు

ఎర్రవల్లి ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఇటిక్యాల ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలం రంగాపూరం గ్రామానికి చెందిన అల్లడి భాస్కర్ గౌడ్ (54) బీచుపల్లి శివారులోని రెండు ఎకరాలు భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గురువారం అదే గ్రామానికి చెందిన ఎల్లమ్మ (46) తన పొలంలో పని నిమిత్తం కూలీకి పిలుచుకుని భాస్కర్‌గౌడ్ తన బైక్‌పై ఎక్కించుకుని కొండపేట వైపు మలుతున్న క్రమంలో అతివేగంగా వచ్చిన బొలెరో బైక్‌ను ఢీకొట్టింది. అల్లడి భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన ఎల్లమ్మను గద్వాల ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్‌ఐ రాజు పరిశీలించి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

దాహం వేస్తుంది.. నీళ్లిస్తారా!

» వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన దుండగుడు

ఊర్కొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల కోసం వచ్చాను.. దాహం వేస్తుంది కొన్ని నీళ్లిస్తారా అంటూ వృద్ధురాలితో మాటలు కలిపి పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రేమలత జంగారెడ్డి వృద్ధ దంపతులు నివసిస్తున్నారు. వారి ఇంటి వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి.. జనాభా లెక్కల కోసం వచ్చాను దాహం వేస్తుంది నీళ్లు కావాలని అడిగాడు. వృద్ధురాలు వెనకాలకు తిరిగి నీటి కోసం వెళ్తున్న క్రమంలో మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు లాక్కొని పారిపోయాడు. బాధితురాలి కుమార్తె వీరెడ్డి మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కల్వకుర్తి సీఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

రెండు మద్యం దుకాణాలలో చోరీ

మహబూబ్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు నగరంలోని రెండు మద్యం దుకాణాల్లో చోరీ జరిగింది. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. మెట్టుగడ్డ ప్రాంతంలోని లక్ష్మీనర్సింహ వైన్స్‌కు బుధవారం రాత్రి అందులో పనిచేసే నర్సింహ తాళం వేసి వెళ్లాడు. గురువారం ఉదయం దుకాణం తెరవగా లాకర్లు పగిలిపోయి ఉన్నాయి. అందులో ఉన్న రూ.90 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. దుకాణం వెనుక ఉన్న ఇనుప గేట్ పగలగొట్టి దుకాణంలోకి చొరబడ్డారు. దుకాణంలో ఉన్న సీసీ కెమెరా డీవీఆర్‌ను పట్టుకెళ్లారు. దీని పక్కనే ఉన్న వినాయ వైన్స్‌లో ఇదే తరహాలో చోరీ జరిగింది. దుకాణంపైన రేకులను తొలగించి లోపలికి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.60వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇక్కడ కూడా సీసీ కెమెరాల డీవీఆర్‌ను పట్టుకెళ్లారు. రాత్రి వర్షం కురుస్తుండడంతో నగదును కౌంటర్‌లోనే పెట్టి వెళ్లినట్లు దుకాణ యజమానులు తెలిపారు. బాధితులు ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మూడు గ్రామాల్లో చోరీ



రెడ్డిపల్లిలో చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న క్లూస్ టీం

గండీడ్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం లోని కొండరెడ్డిపల్లి, రెడ్డిపల్లి, గండీడ్ గ్రామాల్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండరెడ్డిపల్లి ఎముక రాములు ఇంట్లో రూ.20వేలు, ఆరు తులాల వెండి, రెడ్డిపల్లిలో కృష్ణ ఇంట్లో 2 తులాల బంగారు, కమ్మరి నర్సిములు అర తులం బంగారం ఎత్తుకెళ్లారు. మల్లయ్య ఇంట్లో బీరువాలను బద్దలు కొట్టారు. అవుసుల జగదీశ్వర్ ఇంటి తలుపులను గట్టిగా కొట్టినా తెరుచుకోలేదు. మండల కేంద్రంలో కొమ్ము అంజమ్మ ఇంట్లో 12 తులాల వెండి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీం వచ్చి పరిశీలించారు.

చెరువులకు చేపలు చేరేదెన్నడు?

» ఇప్పటివరకు టెండర్లు పిలవని ప్రభుత్వం

» ఉచితంగా వద్దు.. నేరుగా నగదు ఇవ్వాలి

» డిమాండ్ చేస్తున్న మత్స్యకారులు



చేప పిల్లలు (ఫైల్)

పాలమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం ప్రారంభమై రెండున్నర నెలలు గడిచింది. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండటంతో చెరువులు, రిజర్వాయర్లలో నీరు చేరుతోంది. అయినా ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ మాటను మాటవరుసకైనా ఎత్తడం లేదు. ఆగస్టు నెల సగం గడిచినా ఇప్పటి వరకు టెండర్లు పిలవలేదు. గత ఏడాది రెండు నెలలు ఆలస్యంగా టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్లు నాణ్యతలేని, చిన్న సైజు చేపపిల్లలను పంపిణీ చేయడంతో నష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు చెప్తున్నారు. ఈ ఏడా దైనా సకాలంలో చేపపిల్లలను పంపిణీ చేస్తారనుకుంటే ఇప్పటివరకు ఏర్పాట్లు చేయకపోవడంపై అసహనం వ్య క్తం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం జూలై చివరికి వరకు చెరువులు, కుంటలు నిండుతాయి, ఆ వ్పుడు చేపపిల్లలు పోస్తేనే అవి మంచిగా పెరుగుతాయి. వేసవిలో చెరువులు, కుంటల్లో నీరు అడుగంటే సమయానికి కిలో సైజుకు పెరిగి మంచి ఆదాయం లభిస్తుందని మత్స్యకారులు చెబుతున్నారు.

218 మత్స్యకారుల సహకార సంఘాలు

మహబూబ్‌నగర్ జిల్లాలో 218 మత్స్యకారుల సహకార సంఘాలున్నాయి. వాటిలో 11,750 మంది సభ్యు లున్నారు. మత్స్యకార మహిళా సంఘాలు 21 ఉండగా, అందులో 792 మంది సభ్యులున్నారు. గత ఏడాది 1,091 చెరువులు, కుంటలు, కోయిల్‌సాగర్ రిజర్వాయర్ లో దాదాపు 1,93,78,000 చేప పిల్లలను వదిలారు. ఈ ఏడాది 2.50 కోట్ల చేపపిల్లలు అవసరం అవుతాయని మత్స్యకారులు చెప్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షా లతో చెరు వులు, కుంటల్లో నీరు భారీగా చేరి అలుగు లు వారుతు న్నాయి. కోయిల్‌సాగర్ రిజర్వాయర్ నిండ టానికి చేరువలో ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేస్తుందా? లేదా ప్రైవేటుగా కొనుగోలు చేయాలో అర్థం కావడం లేదని మత్స్యకారులు అంటున్నారు. కాంట్రాక్టర్లకు బాధ్యత అప్పగిస్తే చిన్నసైజు చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారని చెప్తున్నారు.

'ఉచితం'తో కాంట్రాక్టర్లకే లబ్ధి

ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడం వల్ల కాంట్రాక్టర్లకే లబ్ధి చేకూరుతోందని సీనియర్ మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. ఒప్పందం మేరకు చేప పిల్లలను పంపిణీ చేయడం లేదని, అధికారులకు అన్ని విషయాలు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

చెరువుల్లో వేసిన చేపల్లో సగం వరకే బతుకుతున్నాయని అంటున్నారు. నాణ్యతలేని, తక్కువ సైజు చేప పిల్లలను అంటగడుతుండటంతో మత్స్యకారులు నష్టపోతున్నారని చెప్తున్నారు. అదికూడా సకాలంలో సరఫరా చేయకపోవడంతో ప్రైవేటుగా కొనుగోలు చేయా ల్సి వస్తోందని వాపోతున్నారు.

నగదు బదిలీతోనే న్యాయం



ప్రతీ సంవత్సరం చెరువులు నిండిన మూడు నెలలకు కాంట్రాక్టర్లు చేపలు పంపిస్తుంటారు. అది కూడా నా సిరకం, కొలతలు, లెక్కలో తేడా ఉంటోంది. దీంతో మత్స్యకారులకు సరైన ధర దక్కక నష్టపోతున్నారు. ప్రభుత్వం సొసైటీలకు నేరుగా నగదు అందజేస్తే మత్స్యకా రులకు సంపూర్ణ న్యాయం లభిస్తుంది. ప్రభుత్వం స్పందించి చేప పిల్లలకు బదులు, నగదు ఇవ్వాలి.

- పాలమూరు యాదయ్య, మత్స్యసహకార సంఘం, ఇబ్రహీంబాద్ మాజీ అధ్యక్షుడు

నగదు ఇస్తేనే మత్స్యకారులకు మేలు

ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీకి బదులుగా నగదు ఇస్తే తమకు మేలు కలుగుతుందని మత్స్యకారులు అభిప్రాయాల పడుతున్నారు. సొసైటీలకు నేరుగా నగదు అందజేస్తే, నాణ్యమైన చేపపిల్లలను కొనుగోలు చేసి తెచ్చుకొని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వదులుకుంటామని అంటున్నారు. తద్వారా కాంట్రాక్టర్లు, అధికారులు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉండదని చెబుతున్నారు. నాణ్యమైన, సరైన సైజు చేప పిల్లలను సకాలంలో చెరువులు, కుంటల్లో వదులుకోవడం వల్ల అవి బాగా పెరిగి లబ్ధి చేకూరుతుందని అంటున్నారు. అందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, మత్స్యకారులు కోరినట్లు నగదు బదిలీ చేస్తుందా? లేదా ఎప్పటిలాగే ఉచితంగా చేపపిల్లలను అందిస్తుందా? అన్న విషయంపై సందిగ్ధానికి తెర పడాల్సి ఉంది.

మల్లమ్మ కుంట రిజర్వాయర్‌కు లైన్ క్లియర్

గద్వాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో భాగమైన మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి లైన్‌క్లియర్ అయ్యింది. సీఎం రేవంత్‌రెడ్డి, భారీ నీటి పారుదల ప్రాజెక్టుల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిల ఆదేశంలో ఫైల్ కదిలింది. వడ్డేపల్లి మండలం తనగల వద్ద 1.05 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే ఈ రిజ్వాయర్‌కు భూసేకరణ చేయాలని రెండు రోజుల క్రితం ఆదేశాలు వచ్చాయి. భూసేకరణ అధికారులు ఆఘమేఘాలపై ప్రిమిలరీ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. రిజర్వాయర్ నిర్మాణం, కెనాల్, ఫీడర్ ఛానల్‌కు అవసరమయ్యే 567.45 ఎకరాల భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. దీని తర్వాత 60రోజులకు పబ్లికేషన్ డిక్లరేషన్‌ను జారీ చేయనున్నారు. ఆ తర్వాత రైతులకు భూ పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకోనున్నారు. అప్పటి నుంచి ఇరిగేషన్ అధికారులు టెండర్ల ద్వార నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు.

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ఇలా..

ఆర్డీఎస్ కింద 87వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని కేటాయించిన 15.9 టీఎంసీలను వినియోగించ కోవడం లేదని అప్పటి తెలంగాణ ప్రభుత్వం 2017లో తుమ్మిళ్ల వద్ద రూ.783కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసింది. 2018లో మొదటి విడతలతో రూ.392కోట్లతో తుంగభద్ర నదీ నుంచి మూడు పంపులతో నీళ్ల తోడేసేందుకు ఎత్తిపోతల పంపులను ఆరు నెలలలో పూర్తిచేసి ఆర్డీఎస్ కాలువకు లింక్ చేసింది. రెండో విడతలో రూ.386కోట్లతో జూలకల్లు, వల్లూరు, మల్లమ్మ కుంటల రిజర్వాయర్‌లను నిర్మించి 87వేల ఎకరాల పూర్తి ఆయకట్టుకు నీళ్లు అందించాలని లక్ష్యం పెట్టుకుంది. అయితే 2018లో ఎత్తిపోతలు ప్రారంభించిన ప్రభుత్వం ఆ తర్వాత రిజర్వాయర్‌ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో మళ్లీ రైతుల పరిస్థితి మొదటికి వచ్చింది. ఆర్డీఎస్ నుంచి డీ-12ఏ నుంచి డీ-43 వరకు మాత్రమే ఆర్డీఎస్ నీళ్లు వచ్చేవి. ఆ తర్వాత తుమ్మిళ్ల ఎత్తిపోతల నీళ్లు పారించేవాళ్లు. కాలువ ఎత్తు పెంచకపోవడం, ఎత్తిపోతల పంపులకు నదిలో నీళ్లు అందకపోవడం లాంటి కారణాలతో సాగునీరు అంతంతే పారింది. కాంగ్రెస్ ప్రభుత్వం మలమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణంకు పూనుకోవడంతో ఆర్డీఎస్ రైతులలో ఆశలు చిగురిస్తున్నాయి.

దళిత, చిన్న సన్నకారులు రైతులు ఉన్నారని...

తుమ్మిళ్ల రిజర్వాయర్‌లో ప్రధానమైన రిజర్వాయర్ మల్లమ్మ కుంట. దీనిని తనగల వద్ద నిర్మించి దాని ద్వార ఆర్డీఎస్ కెనాల్‌కు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఎంపిక చేశారు. అయితే రిజర్వాయర్ నిర్మించే ప్రదేశంలో ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులతో పాటు ఎక్కువగా దళితులే ఉన్నారని వారికి జీవనాధారంగా ఉన్న భూమిని తీసుకోవద్దని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎంపీ డాక్టర్ మల్లు రవి కూడా మల్లమ్మ కుంటకు ప్రత్యామ్నాయంగా చిన్నోనిపల్లి నుంచి ఆర్డీఎస్‌కు లింక్ కెనాల్ ఏర్పాటు చేసే విధానం పరిశీలించాలని అధికారులకు లేఖలు రాసారు. ఈ లేఖ అంశం దుమారం లేపింది. చివరకు ప్రభుత్వం మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయం తీసుకోవడంతో ఆర్డీఎస్ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మోదీ మోసం..
ప్రతీ గడపకు తీసుకుపోతాం

» ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి



మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అప్రజాస్వామికంగా ఓట్లు దొంగిలించి అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన మోసాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతీ గడపకు తీసుకెళ్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోరీ కార్యక్రమానికి మద్దతుగా డీసీసీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అతి ముఖ్యమైనవన్నారు. ఎన్నికల నిర్వహణపై అనేక రకాల అనుమానాలు ఉన్నాయన్నారు, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఎన్నో సార్లు ఎన్నికల కమిషన్‌కు వినతులు ఇచ్చినా ఫలితం శూన్యమన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు నియోజకవర్గంలోనే లక్ష ఓట్లు గోల్‌మాల్ అయ్యాయన్నారు. సాక్ష్యాలతో నిరూపించిన ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యం చేసి మోడీని గద్దె దింపే వరకు పోరాటాలు చేస్తామన్నారు.

కార్యక్రమంలో ఏపీ మిథున్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మన్ యాదవ్, ఆనంద్ కుమార్ గౌడ్, ఎస్పీ వెంకటేష్, సత్తూర్ చంద్ర కుమార్ గౌడ్, వినోద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనితరెడ్డి, వినోద్ కుమార్, సిరాజ్‌ఖాద్రి, సేజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షలకు రూ.10 లక్షలు ఇస్తాం

» ఇద్దరు మోసగాళ్లను పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి నగదుతో ఉడాయించిన మోసగాళ్లను పోలీసులు పట్టుకున్నరు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. నవాబ్‌పేట మండలం పోమాల్‌కు చెందిన రాములు, నారాయణపేటకు చెందిన వెంకట్రాములు ఇద్దరూ కలిసి వెంకట్రాములుకు తెలిసిన నారాయణపేటకు చెందిన ఆశన్నకు ఫోన్ చేశారు. పథకం ప్రకారం రాములు ఆశన్నకు ఫోన్ చేసి పరిచయం చేసుకున్నాడు. తన వద్ద చాలా డబ్బు ఉన్నదని, వీటిని ఎన్నికల సమయంలో నాయకులు పంచే బ్లాక్ మనీ తన వద్ద ఉన్నదని నమ్మ బలికాడు. రూ.లక్ష ఇస్తే రూ.5 లక్షలు, రూ.2 లక్షలు ఇస్తే రూ.10 లక్షలు ఇస్తానని రాములు ఆశన్నకు చెబుతూ మీ ప్రాంతానికే చెందిన వెంకట్రాములుకు కూడా ఇదే విషయం చెప్పానని వివరించాడు. ఈ డబ్బు బయట చెలామణీ అవుతుందని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని నమ్మించారు. ఆశన్న వెంకట్రాములును సంప్రదించగా అవును నిజమే ఇలాంటి డబ్బులు నాయకులు ఎన్నికల్లో పంచుతారని ఇద్దరు డబ్బులు జమచేసుకుని వెళ్దామని చెప్పడంతో ఆశన్న నిజమేనని నమ్మాడు. ఇద్దరూ కొద్దిరోజుల క్రితం రాములును కలిశారు. రాములు వెంకట్రాములు ఇద్దరూ పరిచయం లేనట్లుగా నటించారు. రాములు ఇద్దరికి చెరో రూ.500 నోట్లు ఇచ్చాడు. మీకు అనుమానం ఉంటే ఈ డబ్బులను చెక్ చేసుకోవాలని ఆ తరువాత డబ్బులు తీసుకుని వస్తే ఇలాంటి నోట్లే ఇస్తానని నమ్మించాడు. దీంతో చెరో రూ.2లక్షలు జమచేసుకుందా మని వెంకట్రాములు ఆశన్నను నమ్మించాడు. ఈనెల 12న ఇద్దరూ చెరో రూ.2లక్షలు తీసుకుని జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుడి వద్ద రాములును కలిశారు. వెంకట్రాములు రూ.2లక్షలు నకిలీ నోట్లు తీసుకురాగా, ఆశన్న అసలైన నోట్లు తీసుకువచ్చాడు. ఇద్దరూ చెరో రూ.2లక్షలు రాములుకు ఇచ్చారు. డబ్బులు తీసుకున్న రాములు నా కారు రోడ్డు అవతల ఉందని, డబ్బులు కారులో ఉన్నాయని తీసుకువస్తానని వెళ్లి అటే పారిపోయాడు. వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. రాములు కోసం ఎదురు చూసిన వారు తిరిగిరాకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాలలో వెతికారు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయామని గ్రహించి ఇద్దరూ టూటౌన్ పోలీస్‌స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేశారు. వెంకట్రాములుకు అంతా తెలిసినా ఏమీ తెలియనట్లుగా వ్యవహరించడం గమనార్హం. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. రాములు, వెంకట్రాములు ఇద్దరూ కలిసే ఆశన్నను మోసం చేసినట్లు తేలడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద రూ.2లక్షల అసలు రూ.2 లక్షల నకిలీ నోట్లు రికవరీ చేశారు. కాగా నవాబ్‌పేటకు చెందిన రాములు ముఠా పెద్దగానే ఉందన్న ప్రచారం సాగుతోంది. సమావేశంలో టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్, ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో 18న స్పాట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో కేటీదొడ్డి (బాలికల) 5, 6, 7, 8, 9వ తరగతులకు ఇంగ్లిష్ మీడియంలో 48 మిగులు సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి కే.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లి, తిరుమలహిల్స్‌లో గల గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

గైరాన్‌తండాలో ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు, నాయకులు

చారకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీకగా తీజ్ వేడుకలను నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని గైరాన్‌తండాలో గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజన యువతులు తొమ్మిది రోజులపాటు బుట్టల్లో గోధుమ గింజలు పెట్టి మొలకెత్తిన తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం వేడుకల ముగింపులో భాగంగా తండాలో సాంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. పెళ్లికాని యువతులు మొలకెత్తిన బుట్టలను నెత్తిన పెట్టుకొని ఊరేగించారు. అనంతరం సమీపంలోని చెరువులో మొలకల బుట్టలను నిమజ్జనం చేశారు.

రాష్ట్రపతిని కలిసిన శివకుమార్



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్

కల్వకుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత శివ కుమార్ గురువారం భారత రాష్ట్రపతిని కలిశారు. సంవిధాన్ సపోర్టర్స్ గ్రూప్ తరఫున జాతీయ యువజన అవార్డు గ్రహీతలు 'ఒక దేశం ఒకే ఎన్నిక' అనే భావనపై చర్చించేందుకు అభిప్రాయాలను పంచుకోవడానికి రాష్ట్రపతి అవకాశమిచ్చారని తెలిపారు. దీంతో రాష్ట్రపతిని కలిసే అవకాశం తనకు లభించిందని శివకుమార్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో చేసిన సేవా కార్యక్రమాలను వివరించినట్లు పేర్కొన్నారు.

గంజాయి కేసులో కొనసాగుతున్న విచారణ

» పోలీసుల అదుపులో 8 మంది గోనుపాడు యువకులు?

» ప్రధాన సూత్రధారుల కోసం గాలింపు

గద్వాల క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కొన్ని రోజుల నుంచి గంజాయి సరఫరా జోరుగా సాగుతున్నదనే సమాచారంతో పట్టణ పోలీసులు దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు. గురువారం గద్వాల మండల పరిధిలోని 15 మంది యువకులను అదుపులోకి తీసుకొని వారిలో గంజాయి పరీక్షలు నిర్వహించి 8 మందిని పోలీస్ స్టేషన్‌లో ఉంచి విచారిస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవలే పట్టణంలోని షేరెల్లివీధికి చెందిన ఓ వ్యక్తిని పట్టణ ఎస్‌ఐ అదుపులోకి తీసుకొని అతని నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్న విషయంతెలిసిందే. ఈయన కర్ణాటకలోని రాయచూర్ నుంచి గంజాయిని తెస్తూ ఇక్కడి యువకలకు అమ్ముతున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. గురువారం ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయిని అమ్మే ప్రధాన సూత్రదారులను పట్టుకునేందుకు ప్రత్యేక టీం వెళ్లినట్లు సమాచారం. కర్ణాటక నుంచి తెచ్చిన గంజాయి ప్యాకెట్లను జిల్లా కేంద్రంలోని చింతలపేట, షేరెల్లివీధి, పాత హౌసింగ్‌బోర్డు, కొత్త హౌసింగ్‌బోర్డు, వేణుకాలనీ, గంజిపేటలో కొందరు యువకులు విక్రయించడం, సేవించడం చేస్తున్నారు. ఏదీ ఏమైనా గంజాయి సరఫరాపై మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో వివరాలను వెల్లడించేలా పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

న్యూస్ బాక్స్

నేటి నుంచి మూడు రోజులు మార్కెట్ యార్డు బంద్

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు సెలవుల దృష్ట్యా నిలిపివేసినట్లు మార్కెట్ సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు. ఈనెల 18న యార్డులో క్రయ విక్రయాలు పునఃప్రారంభమవుతాయని, రైతులు గమనించాలని కోరారు.

కృష్ణాష్టమి వేడుకలకు సౌకర్యాలు కల్పించాలి

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పట్టణంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ గురువారం ఒక ప్రకటనలో మునిసిపల్ అధికారులను కోరారు. పట్టణంలో ఈనెల 15, 16వ తేదీల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఊరేగింపు నిర్వహించే గణేష్ మార్గం గుంతలమయంగా ఉందని, గుంతలు పూడ్చి భక్తులకు సౌకర్యం కల్పించాలని కోరారు. పారిశుధ్యం పనులు చేపట్టి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు సింగారం చౌరస్తాలో వెయ్యి గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతు శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన సమితి నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ లోకపల్లి సంస్థానానికి 1667లో వచ్చారని, ఇక్కడి నుంచి గోల్కొండ వెళ్లేందుకు నారాయణపేట, కోటకొండ, కోయిలకొండ మీదుగా వెళ్లారని ఇక్కడి చరిత్ర చెబుతుందన్నారు. విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సైతం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కురుమన్న, కన్న శివకుమార్, మహేష్, శ్రావణ్, నరసింహ, పళ్ల రఘు, చక్రి, శివాజీ తదితరులున్నారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా బాంబ్ నిర్వీర్య పోలీస్ బృందం పోలీస్ జాగిలాలతో పరేడ్ గ్రౌండ్, కలెక్టరేట్, జిల్లా కోర్టు, వీఐపీ గెస్ట్‌హౌస్, జనసామర్థ్యం గల ప్రదేశాల్లో, ప్రధాన చౌరస్తాలో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, సంచులు, వాహనాలు ఏమైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ పాలనలో పేదలకు అందని రేషన్ కార్డులు

మరికల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు అందలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వం అంటేనే సంక్షేమం అనే విధంగా రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వ పాలన ఉందని వీరన్న, హరీశ్, రామకృష్ణారెడ్డి, రాఘవేందర్, ఆంజనేయులు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం చేయి చేయి కలుపుదాం

కోస్గి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం చేయి చేయి కలిపి చెట్లను పెంచుకుందామని విద్యార్థులు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం మండల పరిధిలోని మీర్జాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఎర్త్‌క్లబ్ విద్యార్థులు విత్తన బంతులు తయారు చేశారు. చింత, తుమ్మ, రేగు, నేరేడు, రేల, వేప, కానుగ, సీతాఫలం, కుంకుడు, ఉసిరి చెట్ల విత్తనాలను ఎర్ర మట్టి, సహజ ఎరువులతో విత్తన బంతులు చేసి అటవీ ప్రాంతాల్లో జారవిడిచారు. ఉపాధ్యాయుడు వార్ల మల్లేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

నర్వ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని లంకాల్ గ్రామానికి చెందిన దూల అరుణ్, ఉందెకోడ్ గ్రామానికి చెందిన దయ్యం ఆంజనేయులుకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌వోసీని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ అందించారు. ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎల్‌వోసీ మంజూరైనట్లు ఆయన తెలిపారు. లంకాల పంచాయతీ కార్యదర్శి రాజబాబు, నాగన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, బద్దిపల్లి రాజారెడ్డి, అశోక్‌గౌడ్, నరేష్, జనార్దన్, కొండన్న తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఊట్కూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్ బ్యాంకు సేవలు, సోషల్ మీడియా వేదికగా జరిగే సైబర్ నేరాలు, ప్రభుత్వ బీమా పథకాలు, సుకన్య సమృద్ధి పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్ ఎస్‌కే చాంద్‌సుల్తానా, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మక్తల్ మండలం మంథన్‌గోడ్ చెరువు అలుగు పారడంతో మంథన్‌గోడ్ - జక్లేర్ మధ్య నిలిచిన రాకపోకలు



ఊట్కూర్ మండలం మల్లేపల్లి చెరువు వద్ద నిలిచిన రాకపోకలు

జిల్లాలో భారీ వర్షం



నర్వ మండలం కల్వాల జడ్పీహెచ్ఎస్‌లో చేరిన వాగునీరు



ఊట్కూర్ మండలం మల్లేపల్లి వాగు ప్రవాహంతో సోమేశ్వర్‌బండ, నాగిరెడ్డిపల్లి, మల్లేపల్లికి ట్రాక్టర్‌పై ప్రయాణం ఇలా

కోస్గి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు భారీ వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన భారీ వర్షానికి పలు మండలాల్లో వాగులు పొంగి పొర్లుతున్నాయి. కోస్గి మండలంలోని కొత్తపల్లి ముశ్రీఫా గ్రామాల వద్ద వాగు ఉధృతంగా ప్రవహించింది. ముశ్రీఫా గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగువద్ద బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండటం, పనులు అసంపూర్తిగా ఉండటంతో వాగు ఉధృతితో కోస్గి-దౌల్తాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు వాగువద్ద కోస్గి సీఐ సైదులు ఆధ్వర్యంలో పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ మండలంలో వాగులు, చెరువులను పరిశీలించారు. కోస్గి మునిసిపాలిటీలో బృందావన్ కాలనీ, పద్మావతికాలనీలు జలమయమయ్యాయి.

● మద్దూరు/కొత్తపల్లి : భూనీడు-మద్దూర్ మధ్యన వాగు ఉధృతంగా ప్రవహిస్తు ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు 20 కిలోమీటర్ల నుంచి మద్దూర్, కోస్గి పట్టణాలకు ప్రయాణికులు రాకపోకలు కొనసాగించారు. పలుచోట్ల వాగులను డీఎస్పీ నల్లపు లింగయ్య, మద్దూర్ ఎస్ఐ విజయ్‌కుమార్ పరిశీలించారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. ఎవరైనా వరద నీటిలో చిక్కుకున్నా, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నా వెంటనే 100, కంట్రోల్ రూమ్ నంబరు 8712670399 కాల్ చేయాలన్నారు.



ఊట్కూర్ మండలం మల్లేపల్లి గ్రామ శివారులో నీట మునిగిన పత్తి పంట

● మాగనూరు : మండలంలోని సంగంబండ రిజర్వాయర్ జలాశయానికి నీటి ఉధృతి ఎక్కువైంది. రిజర్వాయర్ గేట్లు ఎత్తడం వల్ల మాగనూరు మండలంలోని పెద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో అడవి సత్యారం గ్రామానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ వాగు బ్రిడ్జి వద్ద పోలీసులు, వీఆర్‌ఏలు కాపలా కాస్తున్నారు. మండలంలోని బైరంపల్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో స్థానికులు, పోలీసులు ట్రాక్టర్లను, కంప చెట్లను అడ్డంగా వేశారు.

● కృష్ణ : మండల కేంద్రంలోని గుర్రం వాగు పొంగి పొర్లుతోంది. వరి మడులు నీటిలో మునిగిపోయాయి. గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక బురదమయంగా మారాయి.

● మక్తల్ : మక్తల్ పెద్ద చెరువు నీటితో నిండి అలుగు పారింది. అలాగే, కాచ్‌వార్, బొందల్‌కుంట కర్ని, ఖానాపూర్ గ్రామాల్లోని చెరువులు సైతం అలుగు పారాయి. కర్ని చెరువు అలుగు పారడంతో అనుగొండ వైపు వెళ్లే 20 గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచి ఇబ్బంది పడ్డారు. మంథన్‌గోడ్ - గోలపల్లి మధ్య బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జక్లేర్ నుంచి మంథన్‌గోడ్ వైపు వెళ్లే రహదారిలో మంథన్‌గోడ్ చెరువు అలుగునీరు కల్వర్టుపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. భారీ వర్షాలకు పత్తి పంటలు నీట మునిగాయి.

● నర్వ : మండలంలోని శ్రీపూర్ - కల్వాల్ మధ్యనున్న కాజ్‌వే వాగు ఉధృతంగా పారుతోంది. గురువారం కాజ్‌వేను పరిషత్, రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది పరిశీలించారు. ప్రజలెవరూ వాగును దాటే ప్రయత్నం చేయొద్దని, తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు.

● ఊట్కూర్ : మండలంలోని ఓబ్లపూర్, చిన్నపొర్ల, మల్లెపల్లి, పెద్దపొర్ల, పులిమామిడి, బిజ్వార్ గ్రామాల చెరువులు నిండి అలుగు పారాయి. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఇడ్లూర్ పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.



కృష్ణ మండలంలోని గుర్రంవాగుకు గండి పడి వరద నీటిలో మునిగిన వరి మడులు

మల్లెపల్లి గ్రామ చెరువు అలుగు పారడంతో సోమేశ్వర్‌బండ, నాగిరెడ్డిపల్లి, మల్లెపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దజట్రం-అవసులోనిపల్లి-బిజ్వార్ మధ్య రోడ్డుపై అలుగుల వద్ద భారీగా నీరు రావడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చిన్నపొర్ల, పెద్దపొర్ల, తిప్రస్‌పల్లి, మల్లెపల్లి గ్రామాల శివారులోని పత్తి, వరి పంట పొలాలు నీట మునిగాయి.

● మరికల్ : మండలంలోని పసుపుల ప్రాథమిక పాఠశాల ఆవరణ వర్షం నీటితో చెరువులా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు ఫీట్ల నీటిలో నడుచుకుంటు పాఠశాలకు చేరుకున్నారు.

వాగులు దాటొద్దు : కలెక్టర్

ధన్వాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరదలు తగ్గేవరకు విద్యార్థులు, ప్రజలు ఎవరు కూడా వాగులు దాటవద్దని కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. ధన్వాడ మండలం పాతపల్లి వాగును గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అధికారులు ప్రజలతో మాట్లాడారు. వచ్చే మూడురోజుల వరకు భారీ వర్షాలు ఉన్నాయని, అందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటు అధికారులను ఆదేశించారు. వాగులు దాటకుండా పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

చెరువైన ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ

మరికల్‌లో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ చెరువులా మారింది. గత కొన్ని సంవత్సరాల నుంచి వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొంటోంది. ప్రయాణికులు బస్సులు ఎక్కాలంటే వర్షం నీటిలో నడుచుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు పోవడానికి దారి లేక బస్టాండ్ ఆవరణలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడాయి. డ్రైవర్లు బస్సులను బస్టాండ్‌లోకి తీసుకెళ్లాలంటేనే వెనకడుగు వేస్తున్నారు.



చెరువులా మారిన మరికల్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ

జిల్లాలో పంద్రాగస్టు సందడి

» పాఠశాలల్లో విద్యార్థులు, కార్యాలయాల్లో అధికారుల ఏర్పాట్లు

నారాయణపేట/నారాయణపేట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టును పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా గురువారం జనరల్, స్టేషనరీ, పుస్తక దుకాణాల్లో విద్యార్థులు, యువకుల సందడి కానవచ్చింది. స్వాతంత్య వేడుకలకు సంబంధించి రంగురంగుల కాగితాలు, త్రివర్ణ జెండాలను యువత కొనుగోలు చేస్తున్నారు. ఇంకొందరు కొత్త డ్రస్సులు, బూట్లను, పూలను కొంటు కానవచ్చారు. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. నారాయణపేటలో జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హాజరు కానున్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో ఆయన జెండావిష్కరణ చేసి, ప్రసంగించనున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్‌గౌతమ్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి తదితరులు హాజరు కానున్నారు. అలాగే, పేట మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తరగతి గదులను విద్యార్థులు ముస్తాబు చేశారు. మైదానాన్ని శుభ్రం చేసి జెండా పండుగకు సిద్ధం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు గాను శిక్షణ పొందారు. అదేవిధంగా మిఠాయిలను పంచి పెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరంగా జెండా ఎగురవేద్దాం

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతీ ఇంటిపై తిరంగా జెండా ఎగురవేసి దేశ భక్తిని చాటుదామని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ పిలుపునిచ్చారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అవధూత్ మఠం నుంచి సెంటర్ చౌక్, వీర సావర్కర్ చౌరస్తా మీదుగా సత్యనారాయణ స్వామి చౌరస్తా వరకు సాగింది. బీజేపీ రాష్ట్ర నాయకులు రతంగ్‌పాండురెడ్డి, శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, నాయకులు రఘురామయ్యగౌడ్, నందు నామాజీ, సిద్ది వెంకట్‌రాములు, ఆశప్ప, లక్ష్మిశ్యామ్ సుందర్‌గౌడ్, సుజాత కృష్ణ, వినోద్‌కుమార్, సత్యరఘుపాల్, చిన్నరఘు, సైదప్ప, విజయ్, లక్ష్మికాంత్, హన్మంత్‌రావు, కిరణ్ ఉన్నారు.



పేటలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

నారాయణపేటరూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు న్యాయ సేవా అవగాహన సదస్సు నిర్వహించారు. పీపీ కె.సురేష్, చీఫ్ డిఫెన్స్ లక్ష్మీపతిగౌడ్ హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయ సలహాల కోసం 15100 నెంబర్‌కు ఫోన్ చేస్తే సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి నరహరి, పారాలీగల్ వలంటీర్ అన్నమ్మ, కె.యాదమ్మ, రూపిక, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఊట్కూర్ హాస్టల్ వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి

ఊట్కూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ జగదీశ్వర్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు కొక్కు గౌతమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హాస్టల్‌ను సందర్శించి బుధవారం రాత్రి జరిగిన సంఘటనపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగొచ్చి హాస్టల్‌లో ఉంటున్న గిరిజన విద్యార్థిని గెంటివేసిన వార్డెన్‌పై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వచ్చే 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి

» రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు, మూడురోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు మరింత అప్రమత్తంగా ఉండి ఏవిధమైన ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై సీఎస్ రామకృష్ణారావుతో కలిసి గురువారం సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు కోటి రూపాయలు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్‌డీసీ రాజేందర్‌గౌడ్, జడ్పీ సీఈవో శైలేష్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 8 లక్షల మొక్కలు నాటుతున్నాం

ధన్వాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేట నియోజకవర్గంలో 8 లక్షల మొక్కలు నాటుతున్నామని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాలలో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతు విద్యార్థులతో పాటు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. ప్రిన్సిపాల్ రాజారాం, డీఆర్‌డీవో మొగులయ్య, డీఈవో, డీఎఫ్‌వో తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

ముడుమాల్‌లో ఆంజనేయస్వామి, బొడ్రాయి ప్రతిష్ఠ

కృష్ణ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల్ గ్రామంలో ఆంజనేయస్వామి ముఖద్వారం, బొడ్రాయి ప్రతిష్ఠాపన, మోసాడి ముఖద్వారం పాలమవ విగ్రహం ప్రతిష్ఠాపన గురువారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన అనంతరం గ్రామస్థులు అన్నదానం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ తదితరులు ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికకు 161 ఫిర్యాదులు

నారాయణపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గురువారం స్థానికంగా ఉన్న ఉప విద్యుత్ కేంద్రంలో జరిగిన పరిష్కార వేదికకు 161 ఫిర్యాదులు వచ్చాయి. సదస్సుకు సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరమణ, సీజీఆర్ఎఫ్ రెడ్రెసెల్ ఫోరం 1 సీజీఎం, మెంబర్ ఫైనాన్స్ రామాంజనాయక్, ఇండిపెండెంట్ మెంబర్ ఎన్‌కెకె వెంకట్ హైదరాబాద్ వారి నేతృత్వంలో కొనసాగింది. విద్యుత్ సరఫరాలో తరచూ ఏర్పడే అంతరాయాలతో పాటు సరఫరాలో ఏర్పడే హెచ్చుతగ్గులతో పాటు పలు సమస్యలపై వినియోగదారుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. నూతన విద్యుత్ మీటర్ల సమస్యలు, కొత్త సర్వీసులు ఇచ్చుటలో జాప్యం, యాజమాన్యం పేరు బదిలీ సర్వీసులో మార్పు, విద్యుత్ సరఫరా పునరుద్ధరనలో జాప్యం తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

వ్యవసాయ రంగానికి విద్యుత్ పోల్స్ కావాలి

కాగా, పరిష్కార వేదికలో వ్యవసాయ రంగానికి విద్యుత్ పోల్స్ కావాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. 14 మండలాల్లో అత్యధిక శాతం రైతులు విద్యుత్ పోల్స్ అందించాలని డీఈఈ నర్సింహరావును కోరారు.

భూనిర్వాసితులకు న్యాయం చేసే వరకు పోరాటం ఆగదు



భూనిర్వాసితులతో కలిసి కాచ్‌వార్ నుంచి మక్తల్‌కు పాదయాత్ర నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భూనిర్వాసితులకు న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమ్మోహన్‌రెడ్డి, భూనిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి టింగిలి గోపాల్ అన్నారు. గురువారం పట్టణంలోని కాచ్‌వార్ గ్రామంలో భూనిర్వాసితులకు న్యాయం చేయాలని కాచ్వార్ గ్రామం నుంచి మక్తల్ వరకు పాదయాత్రను ప్రారంభించి, మాట్లాడారు. మక్తల్, పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూనిర్వాసితుల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు. 29 రోజుల నుంచి శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. బీఆర్ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, భూనిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, మచ్చందర్‌రెడ్డిలు మాట్లాడారు. అనంతరం కాచ్‌వార్ నుంచి మక్తల్ వరకు పాదయాత్ర నిర్వహించి తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు కిరణ్, గోపాల్, ఆంజనేయులుగౌడ్, సీఐటీయూ నాయకులు బలరాం, గోవిందరాజు, భూనిర్వాసితులు శ్రీనివాస్‌గౌడ్, కేశవులు, రాఘవేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

» అఖిల భారత రైతు ఐక్య సంఘం ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరగనున్న ఏఐకేయూఎస్ రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా యాదగిరి, న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్‌లు మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలు ఆశాజనకంగా లేవన్నారు. గత 30 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్నాయన్నారు. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జరిగే ఈ మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నరసింహ, కెంచె నారాయణ, ప్రశాంత్, వెంకట్రాములు, హాజీమలంగ్, చెన్నప్ప, అంజి, కృష్ణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు

దామరగిద్ద/మక్తల్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో మొత్తం 171 మంది పేషెంట్లకు స్ర్కీనింగ్ చేశారు. స్ర్కీనింగ్‌లో మొత్తం 134 మందికి ఎక్స్‌రే తీశారు. 21 మందికి పాజిటివ్‌గా గుర్తించారు. పలువురికి హెచ్‌బీ, హెచ్‌బీఎస్ఏజీ, ఆర్‌బీఎస్, హెచ్ఐవీ, బీపీ, వీడీఆర్ఎల్ టెస్టులు చేశారు. డాక్టర్ ఐశ్వర్య, కనిగిరి, డాక్టర్ షీలా హరిచందనరెడ్డి, డాక్టర్ సూర్యభరత్‌సింహారెడ్డి, డాక్టర్ అమీర్ సోహెల్, సిబ్బంది పాల్గొన్నారు.

అదేవిధంగా, మక్తల్ మండలం దాసర్‌దొడ్డి గ్రామంలో కర్ని పీహెచ్‌సీ చందాపూర్ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు గురువారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్‌తో పాటు, ఎక్స్‌రే పరీక్షలు చేశారు. అవసరమైన వారిని ప్రభుత్వ వాహనంలో జిల్లా కేంద్రానికి తరలించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డా.వినోద్, డా.హబీబ్, డా.సమీనా, డా.నవీన, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.